నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 26 ఆగస్టు 2025 - పేజీలు 8








# జిల్లాలో నకిలీ... మందుల దందా..

- సర్టిఫికెట్ ఒకరిది.. నిర్వాహణ మరొకరిది
- పట్టించుకోని అధికారులు

**నేటిదినపత్రిక సూర్య, పల్నాడు /గుంటూరు ప్రతినిధి**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నకిలీ మందుల దందా జోరుగా కొనసాగుతున్నది. ఆయా మందుల దుకాణాల్లో దొరుకుతున్న మందులలో ఏవి నకిలీవో.. ఏవి అసలివో తెలియని పరిస్థితి నెలకొంది. మెడికల్ షాపుల యజమానులు నకిలీ మందులు అమ్మి అందినకాడికి ప్రజల నుండి దోచుకుంటున్నారు. అధికారుల అండదండలతో ఇష్టారీతిగా వ్యవహ రిస్తున్నారు. అసలు జిల్లాల్లో డ్రగ్స్ అధికారులు ఉన్నారా.. ? లేరా..? ఉంటే వారి కార్యాలయాలు ఎక్కడ ఉన్నవో తెలియని పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉంది. వారికి నెల నెల మాముళ్లు అందితే చాలు. ఇక ఆ మెడికల్ షాపుల వైపు సైతం కన్నెత్తి చూడరనే ఆరోపణలు ఉన్నాయి.

**సర్టిఫికెట్ ఒకరిది.. నిర్వాహణ మరొ కరిది..**

జిల్లాల్లోని చాలా వరకు మందుల షాపుల్లో సర్టిఫికెట్ ఒకరిది.. నిర్వాహణ మరొ కరిది.. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుంది. అనుమతులు లేకుండా ఇష్టారీతిగా వేలల్లో మందుల దుకాణాలు వెలిశాయి. ఐనప్పటికి ఏ మాత్రం చర్యలు ఉండవు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలో వర్షాలు పడ్డాయి. దీంతో జిల్లాలలోని వైరల్ జ్వరాలు వస్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొంత మంది ఆర్ఎంపీలు, ఇతర ప్రైవేట్ హాస్పిటల్స్ యజమానులు కుమ్మక్కై వారి కనుసన్నల్లోనే మెడికల్ షాపులు పెట్టి నకిలీ మందులను తీసుకవచ్చి అమ్ముతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

**నకిలీ మందులు..**

జ్వరం, దగ్గు, నొప్పులు, బీపీ, షుగర్ తదితర వాటికి వివిధ మెడికల్ షాపుల్లో నకిలీ మందులు రాజ్య మేలుతున్నాయి. నిత్య జీవితంలో విరివిరగా వాడుతున్న మందులను టార్గెట్ చేసుకొని ఆ మందులనే నకిలీవి తెచ్చి అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ మందుల్లో నకిలివి, అసలివో గుర్తుపట్టరాకుండా ఉంటున్నాయి. వీటికి తోడు కాలం చెల్లిన మందులను సైతం నిరక్ష్యరాస్యులకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

**మెడికల్ షాపులపై నియంత్రణ కరువు..**

అనుముతులు లేకుండా ఇబ్బడి ముబ్బడిగా మందుల షాపులు వెలుస్తున్నా అడిగే వారే లేరు. ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో మెడికల్ షాపులు ఉన్నట్లు సమాచారం. ఇవి కాకుండా ఇతర చిన్న చిన్న షాపులు కుడా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుండి పెద్ద మొత్తంలో నకిలీ మందులు స్థానిక జిల్లాలకు వస్తున్నాయి. అరికట్టాల్సిన అధికారులు పూర్తిగా చేతులేత్తేశారు. మాకేంది.. మాకు నెల నెల మామూళ్లు వస్తే చాలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. శాఖా పరమైన పనులు పక్కన పెట్టి పూర్తిగా సొంత పనులు, వ్యాపారాలపై దృష్టి సారించారు. అయా మెడికల్ షాపులపై నియంత్రణ కరువైంది. అడిగే వారు లేక పోడంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం సరిగా అందడం లేదు. దీంతో ప్రైవేట్ దవాఖానలోకి ప్రజలు వెళ్లుతున్నారు. అక్కడికి వెళ్లితే అక్కడ ఇష్టం వచ్చిన రితీలో ఫీజులు గుంజుతున్నారు. అందినకాడికి మందులలో వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ దవాఖనాల్లో అంతంతనే వైద్యం అందుతుంది. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కరువైంది. మందుల కొరత, వైద్యులు సకాలంలో వైద్యం అందించడం లేదు.

**అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియదు..?**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఎక్కడ ఉన్నారో తెలియదు. జిల్లాకు మిగతా 3వ పేజీలో




## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకూడదని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్లు మిగతా 3వ పేజీలో

## అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

### అర్జీల పరిష్కారంలో అర్జీదారుని సంతృప్తే ధ్యేయం

### పిజిఆర్ఎస్ లో 146 అర్జీల రాక - జిల్లా కలెక్టరు పి.అరుణ్ బాబు

**నరసరావుపేట మేజర్ న్యూస్**

(పిజిఆర్ఎస్)వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా జిల్లా నలుమూలలు నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను జిల్లా కలెక్టరు పి అరుణ్ బాబు స్వీకరించారు.జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన మిగతా 3వ పేజీలో





# విజ్ఞాన్ నిరులాలో యురేకా - పిచింగ్ కాంపిటీషన్




**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్ :**
విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల లో సోమవారం ఐఐటీ ముంబై ఆధ్వర్యంలో యురేకా–పిచింగ్ కాంపిటీషన్ తొలి విడత నిర్వహించినట్లు విజ్ఞాన్ నిరుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. ఈ తొలి విడత పోటీలో గుంటూరు పరిసర ప్రాంతాల నించి సుమారు 80 మంది ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఆసియా లోనే అతి పెద్దది గా భావించే బిజినెస్ ప్లాన్ కాంపిటీషన్‌లో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీ అంగన్వాడీలను మినహాయించాలి



**తెనాలి, మేజర్ న్యూస్ :**
సామాజిక పెన్షన్లు ఇచ్చే బాధ్యత నుంచి అంగన్వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సోమవారం కొల్లిపర తహసిల్దార్ జి సిద్ధార్థకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంగన్వాడి విధులకు ఇబ్బంది కలిగించే ఈ ఈ సామాజిక పెన్షన్లు పంపిణీ బాధ్యత నుంచి తెప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ములకా శివ సాంబిరెడ్డి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు నిర్మల జ్యోతి ఎం సీతమ్మ ఎస్ శ్రీలక్ష్మి లక్ష్మీదేవి ఎం జ్యోతి టీ లావణ్య ఎం వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**– ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలి**
**– 12 అడుగులకు మించి వినాయకుని విగ్రహం ఉండకూడదు**
**– డీజేలకు అనుమతులు లేవు**
**– మీడియా సమావేశంలో వెల్దుర్తి ఎస్సై**

**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**



ఈ ఏడాది గణేష్ ఉత్సవాల కోసం పర్మిషన్ తీసుకోవడం మరింత సులభం అయ్యిందని వెల్దుర్తి ఎస్సై సమందర్ వలి తెలిపారు. ఇంతకు ముందు ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా పోలీస్ స్టేషన్‌కి వచ్చి పర్మిషన్ దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించిందని ఆయన వివరించారు. ఈ వెబ్ సైట్‌లో అప్లికేషన్ నమోదు చేసుకోవడంతో అన్ని విభాగాలకు సమాచారం చేరుతుందని, పోలీస్ విభాగం తనిఖీ చేసిన తర్వాత నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వబడుతుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి క్యూఆర్ కోడ్ తీసుకుని పందిరి వద్ద అతికించుకోవాలని సూచించారు.

అలాగే, ఈ పండుగలో డీజే పర్మిషన్ ఇవ్వబడదని, కేవలం మైక్ మాత్రమే ఉపయోగించుకోవచ్చని, విగ్రహాల ఎత్తు 12 అడుగులకు మించి ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ వంటి ఇతర అనుమతులు సంబంధిత విభాగాల నుంచి ముందుగానే పొందాలని సూచించారు. ఈ పండుగను ప్రజలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తే మంచి వాతావరణం ఏర్పడుతుందని, అన్ని శాఖలు సహకరించి గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరగాలని ఎస్సై సమందర్ వలి కోరారు.

# కస్తూరి ఆర్ట్ గ్యాలరీ సందర్శించిన సంస్కార భారతి బృందం

**తెనాలి, మేజర్ న్యూస్ :** తెనాలి కాటూరి ఆర్ట్ గ్యాలరీని సంస్కార భారతి అఖిలభారత సంఘటన కార్యదర్శి అభిజిత్ గోఖలే, సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వీ ఎన్ కృష్ణ, కార్యదర్శి రామ్ కుమార్ సభ్యులు అల్లు రాంబాబు, మురళీధర్ లు సందర్శించారు. విజయవాడ విచ్చేసిన వారిని తమ ఆర్ట్ గ్యాలరీని తిలకించవలసిందని నిర్వాహకులు కళా రత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవి చంద్రలు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్ట్ గ్యాలరీ కి విచ్చేసిన సందర్భంగా 3 టన్నుల ఐరన్ స్క్రాప్ తో తయారు చేసిన బుల్ విగ్రహాన్ని ఆవిష్కరింప చేసారు. ఆర్ట్ గ్యాలరీని ఆశాంతం తిలకించిన ఆయన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలవేసి శివాజీ మహారాజ్ పట్ల వారికి ఉన్న భక్తిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళా రత్న కాటూరి మాట్లాడుతూ కాంస్యం, ఫైబర్, పంచలోహ, స్టెయిన్లెస్ స్టీల్, ఐరన్ స్క్రాప్ తో చేసిన విగ్రహాల తో ఆర్ట్ గ్యాలరీ ఉండటం భారతదేశంలో ఇది ఒకటేనని సగర్వంగా చెప్పారు. ఇప్పటికీ ఈ ఆర్ట్ గ్యాలరీని ఎంతోమంది ప్రముఖులు సందర్శించి ప్రశంసించారని, శివాజీ మహారాజ్ విగ్రహాన్ని 21.6 అడుగుల ఎత్తు 15.6 వెడల్పు గల సప్తపలకల మండపంలో 10 టన్నుల ఐరన్ స్క్రాప్ తో తయారు చేస్తున్నట్లు అది పూర్తి అయితే ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించితే ప్రపంచంలోనే అతి గొప్ప కళాఖండం ఉన్న ఆర్ట్ గ్యాలరీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కళాఖండాలలో కొన్నింటిని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో అనుకరించాలని ఉద్దేశంతో ముందుగా విజయనగరంలోని హంపిలో



శిథిలావస్థలో ఉన్న రథాన్ని పోలిన రథాన్ని తయారు చేస్తున్నట్లు కాటూరి చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అభిజిత్ గోఖలే మాట్లాడుతూ ఇక్కడ ఉన్న ఐరన్ స్క్రాప్ విగ్రహాలు బంగారంతో చేసే ఆర్నమెంట్లు అతి జాగ్రత్తగా ఎలా అతుకుతారో అలా జాగ్రత్తగా ఐరన్ ముక్కలను అతికి చక్కని కళాఖండాలను తయారుచేశారని అలాగే పురాణ పురుషులు రాముడు, కృష్ణుడు, నవయుగ పురుషులు వల్లభాయ్ పటేల్ ఇతర రాజకీయ నాయకులు విగ్రహాలు కూడా ఎంతో చక్కగా తయారు చేశారని కొనియాడారు.

కాటూరి ఆర్ట్ గ్యాలరీలో విగ్రహాలు జీవం ఉట్టిపడేలాగా ఉన్నాయని, శిల్పకళాకారులు కళా రత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్రలను ఆయన ప్రశంసించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ కలలకు కానాచి అనగానే గుర్తుకు వచ్చేది తెనాలి అని ఎందరో కళాకారులు తెనాలి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు ఆ కోవకు చెందిన వారే కాటూరి వెంకటేశ్వరరావు వారి కుమారుడు రవిచంద్ర అని ప్రశంసించారు. అలాంటి కాటూరు వెంకటేశ్వరరావు మా సంస్కార భారతి సభ్యులు కావడం గర్వకారణంగా భావిస్తున్నామని ఆయన అన్నారు. కాటూరి రవిచంద్ర మాట్లాడుతూ విభిన్న మెటీరియల్ లో తయారు చేసిన విగ్రహాలు ఉన్న గ్యాలరీ ఆంధ్ర ప్రదేశ్ లోనే అతి పెద్ద ఆర్ట్ గ్యాలరీ తమదేనని ఇంకా ఈ గ్యాలరీలో ఎన్నో కళాఖండాలను రూపొందిస్తున్నామని తెలియజేశారు అలాగే ఈరోజు విచ్చేసిన అతిధులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# నటసింహం బాలకృష్ణకు జూలకంటి అభినందనలు



**వెల్దుర్తి మేజర్ న్యూస్ :**
సినీ రంగంలో 50 ఏళ్ల అద్భుతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న నటసింహం, హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణను మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., బాలకృష్ణ తెలుగు సినీ పరిశ్రమకు చేసిన సేవలు అపూర్వమని, తన ప్రతిభతో, కృషితో ఎన్నో తరాలకు ప్రేరణగా నిలిచారన్నారు. ఇటువంటి ప్రత్యేక సందర్భంలో లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ బంగారు ఎడిషన్‌లో ఆయన స్థానం సంపాదించడం మనందరికీ గర్వకారణమని ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా ప్రజలకు దగ్గరైన బాలకృష్ణకు దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకోవడం గర్వ కారణం అన్నారు.

# సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

**– సివిల్ జడ్జి టి. ప్రవళిక వెల్లడి**

**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు వారి ఆదేశాల మేరకు సెప్టెంబర్ 13న రెండవ శనివారం న్యాయ సేవాధికార సంస్థ, పిడుగురాళ్ల ఆధ్వర్యంలో స్థానిక సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్పర్సన్, మరియు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) టి. ప్రవళిక సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ నందు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రీ లిటిగేషన్ కేసులు ( ముందస్తు వాజ్యములను) తదితర కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము, ధనము ఆదా అవుతుందని తెలియజేశారు. సెప్టెంబర్ 13న రెండవ శనివారం న పిడుగురాళ్ల సివిల్ జడ్జ్ ( జూనియర్ డివిజన్) కోర్టు ప్రాంగణంలో జాతీయా లోక్ అదాలత్ జరుగును అని తెలిపారు. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవలసిందిగా కోరారు.

## అధికార భాషా సంఘానికి

# మండలి పేరు సరికాదు : పురుషోత్తమ శర్మ



**తెనాలి, మేజర్ న్యూస్ :** అధికార భాషా సంఘానికి గిడుగు శ్రీరామ్మూర్తి పంతులు లేదా తొలి తెలుగు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్య నారాయణ ఇరువురి పేర్లలో ఒకరి పేరు పెట్టాలని, ఆపన్నప్రదీప బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమ శర్మ ప్రభుత్వాన్ని కోరారు. అధికార భాషా సంఘానికి, దివంగత నేత మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టటం పట్ల విస్మయ వ్యక్తం చేశారు. మండలి వెంకట కృష్ణారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన రాజకీయ దురంధరులు కానీ అధికార భాష సంఘానికి వారి పేరు పెట్టే అంత గొప్ప వ్యక్తి మాత్రం కాదున్న అభిప్రాయం ఆయన వెలిబుచ్చారు. వాడుక భాష పితామహులు, లిపిలేని సవర భాషకి లిపి కల్పించిన మహోన్నతులు గిడుగు శ్రీరామ మూర్తి పంతులు పేరు గాని, రామాయణ కల్పవృక్షం రచయిత, తెలుగుకి తొలి జ్ఞానపీఠ అవార్డు తీసుకుని వచ్చిన పండితులు, విశ్వనాథ సత్యనారాయణ పేరుని గాని పెట్టాలని కోరారు. వీరి వీరి లో ఎవరో ఒకరి పేరు పెట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజ ధాని అమరావతి ఖ్యాతిని విషయప్తం చేసిన వారు అవుతారని అన్నారు. కళాకారులు కవులు పండితులు, జ్ఞాన సంపన్నులు ఎందరో మహనీయులు పుట్టిన నేలలో అధికార భాషా సంఘానికి వీరి ఇరువురిలో ఎవరో ఒకరి పేరు పెట్టడం చదువుకున్న ప్రతి ఒక్కరిని గౌరవించినట్లు అవుతుందని పురుషోత్తమ శర్మ అన్నారు. అధికార భాష సంఘాన్ని రాజకీయాలకు వాడుకోకూడదని, ఒకవేళ రాజకీయంగా మాట్లాడాల్సి వస్తే, అసెంబ్లీలో బ్రాహ్మణులకు ఒక ఎమ్మెల్యే గాని ఒక ఎమ్మెల్సీ గాని ఒక కాబినెట్ హోదా గల నామినేటెడ్ పోస్ట్ గాని ఇవ్వకుండా, ఈ కూటమి ప్రభుత్వం, కనీసం ఆత్మభిమానం గల బ్రాహ్మణ వర్గీయుల మనోభావాలు పరిగణలోకి తీసుకోకుండా, మండలి వెంకట కృష్ణారావు పేరుని అధికార భాషా సంఘానికి పెట్టటం అనలోచిత నిర్ణయం అని పూరషోత్తమ శర్మ అన్నారు. భాషాభివృద్ధికి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, ఇలా ఎందరో పెద్దలు, వారి పేరు చెబితేనే భావితరాలన్నీ కూడా పులకించి పోయే విధంగా ఉంటాయి, అటువంటి కీర్తిని భాషకు తీసుకొచ్చిన మహనీయుల పేర్లు పెట్టాలి గాని, రాజకీయపరమైన మండల వెంకటకృష్ణ రావు పేరు పెట్టడం ఎంత మాత్రం సమంజసం కాదని అన్నారు. ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా గా వున్న బ్రాహ్మణ వర్గీయుల మనోభావాలు గౌరవిస్తూ, గిడుగు శ్రీరామ్ మూర్తి పంతులు పేరును కానీ, విశ్వనాథ సత్యనారాయణ పేరుని కానీ పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పరిశీలించాలని ఆయన కోరారు.

# కుప్పంలో జల సంబరం... చంద్రబాబుతోనే సాధ్యం

▸ ఏడాదిలోనే కుప్పానికి కృష్ణమ్మను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే ▸ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ

**గుంటూరు మేజర్ న్యూస్ :** "కుప్పం నేలను తాకుతూ బిరబిరా కృష్ణమ్మ పరుగులు పెట్టగా.. పల్లెల్లో సంతోషాలు విరబూసాయని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్. మన్నవ మోహన కృష్ణ అన్నారు. సోమవారం ఆయన గుంటూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువకులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు కృష్ణా జలాల్లో తడిసి ముద్దయ్యారు. నెర్రెలిచ్చిన భూములు నవ్వుతున్నాయి. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. తమ ఊళ్లను పలకరిస్తూ పారుతున్న కృష్ణాజలాలను కాలువల వెంట రైతులు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఎక్కడ శ్రీశైలం ప్రాజెక్టు? ఎక్కడి కుప్పం? అక్కడి నుంచి ఇక్కడికి కృష్ణమ్మని రప్పించిన అపర భగీరథుడు కుప్పం ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబునాయుడు. ఎన్నో కొండల్ని తొలిచి.. ఎన్నో లోయల్ని పూడ్చి.. దారి ఏర్పరిస్తే.. అప్పుడు కానీ కృష్ణమ్మ కుప్పం నేలని తడపలేదు. దీంతో ఇన్నేళ్లకి ఏళ్లనాటి సీమ ప్రజల కల నెరవేరినట్లైంది. హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా.. ప్రాజెక్ట్ విస్తరణ, లైనింగ్ పనుల్ని ఎన్డీఏ సర్కార్ 6 నెలల్లోనే పూర్తి చేసి..



ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో సామర్థ్యం పెంచింది. ప్రవాహ మార్గంలో సీమజిల్లాల సాగు, తాగునీటి అవసరాలని తీరుస్తూ కుప్పం వరకు కృష్ణమ్మను తెచ్చింది సర్కార్. దీంతో శ్రీశైలం నుంచి 600 కిలోమీటర్లు ప్రయాణించిన కృష్ణమ్మ.. శరవేగంగా ముందుకు దూకుతూ కుప్పం పంట కాలువల్లోకి ప్రవేశించింది. ఈ నీళ్ల కోసం సంవత్సరాలుగా ఎదురుచూసిన కుప్పం రైతులు.. ఎట్టకేలకి వాళ్ల ఆశ తీరడంతో.. కుప్పం నేల కృష్ణమ్మ జలాలతో తడవడంతో ఆనందంగా సంబరాలు చేసుకుంటున్నారు." అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. . కుప్పం నియోజకవర్గ ప్రజలు తాగు, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణమ్మ జలాలను తీసుకొచ్చిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ప్రశంసించారు. గత ప్రభుత్వంలో జగన్.. సినిమా సెట్ వేసి కృష్ణా జలాలను కుప్పానికి ఇస్తున్నామని జగన్నాటకం ఆడారని గుర్తుచేశారు. ఇక ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కుప్పానికి కృష్టమ్మను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదన్నారు. రానున్న రోజుల్లో స్వర్ణ కుప్పం చేయడం ఖాయమని స్పష్టం చేశారు. సోమవారానికంతా పరమసముద్రం చెరువుకు కృష్ణా జలాలు చేరాయని, త్వరలోనే నియోజకవర్గంలోని 240 చెరువులు నిండటం ఖాయమన్నారు. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు.. పరమసముద్రం చెరువు సమీపంలో జలహారతి ఇస్తారన్నారని అన్నారు. గంగమ్మను దివి నుంచి భూవికి రప్పించింది ఆ భగీరథుడైతే... కుప్పం రైతుల కరువు తీరేలా చేస్తున్న అపర భగీరథుడు కుప్పం ముద్దబిడ్డ నారా చంద్రబాబునాయుడు అని మోహనకృష్ణ పేర్కొన్నారు.

# భూగర్భ జల వనరులను పెంపొందించేందుకు చర్యలు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో భూగర్భ జలవనరులను పెంపోదించేందుకు జలవనరులు, గ్రామీణ నీటిపారుదల , పబ్లిక్ హల్త్ ఇంనీరింగ్ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఇతర శాఖల అధికారులు కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజతో కలసి భూగర్భ జలవనరుల పరిరక్షణ, ఈపీటీఎస్, స్వామిత్వా, ప్రధాన మంత్రి అవాస్ యోజన తదితర కార్యక్రమాలపై జిల్లా, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ



మాట్లాడుతూ జిల్లాలో భూగర్భజలవనరులు పరిరక్షణకు చెరువులు నింపుకోవటం, రెయిన్ హార్వేస్ట్ స్ట్రక్చర్లు ఏర్పాటు, మొక్కలు పెంపకం తదితర కార్యక్రమాలను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులను ఈపీటీఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేసే ప్రక్రియను అన్ని శాఖల అధికారులు

## అధికారులను ఆదేశించిన కలెక్టర్

అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు . మండల పరిధిలో కార్యాలయాల్లో ప్రతిరోజు కనీసం 300 ఫైల్స్ అప్లోడ్ చేయాలన్నారు. స్వామిత్వ పథకం ద్వారా నివాస ప్రాంతాల్లో జరుగున్న సర్వేను వేగవంతం అయ్యేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో మంజూరు చేసిన ఇళ్ళు నిర్మాణాలను పూర్తి అయ్యేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పకడ్బంది ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రతి గ్రామంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు

**నరసరావుపేట మేజర్ న్యూస్:** ఈనెల 25న జాతీయ నేత్ర దాన పక్షోత్సవములలో భాగముగా 25 నుండి 8 వరకు ప్రజలలో నేత్రదానం ప్రాముఖ్యత గురించి ప్రతి గ్రామములో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ద్వారా ప్రచారం చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి ప్రకటనలో తెలిపారు . కార్యక్రమమునకు సంబంధించిన గోడ పత్రిక కరపత్రములను పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ఆవిష్కరించారు ఎవరైనా మరణించిన తర్వాత ఆరు గంటల్లోపు ఒకవేళ మార్చురి బాక్సులు ఉంచినట్లు అయితే 10 గంటల్లోపు సమీపములోని ఐ బ్యాంకు కి సమాచారం తెలిపి నేత్రదానం



చేయవచ్చునని ఒకరినించి తీసిన రెండు కార్నియాల ద్వారా ఇద్దరికీ ఆపరేషన్ చేసి చూపు తెప్పించవచ్చునని, ఎక్కువమంది విద్యావంతులు సామాజిక స్పృహ ఉన్నవారు చనిపోయిన తర్వాత నేత్రదానం చేయాలని సంకల్పించుకోవాలని ముందుగా ఎటువంటి అంగీకారం లేకపోయినా కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రదానం చేయవచ్చునని జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ ఏ భువనేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో పలనాడు జిల్లాలో మొత్తం 60 కార్నియాలు ( నల్లగుడ్డు) నేత్రదానం చేయడానికి ప్రోత్సాహం చేసిన శ్రీ సంద్రపాటి చలపతిరావు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి నకు జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు . కార్యక్రమంలో పలనాడు జిల్లా అధికారులు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ప్రసూన ,ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, మర్లపాటి రామకృష్ణ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

# పల్నాడు జిల్లాలో యూరియా కొరత లేదు

**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

▸ అక్రమ నిల్వల పై నిఘా ఉంచండి
▸ జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, జిల్లాకు సరిపడా యూరియా ఇప్పటికే అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ అరుంబాబు స్పష్టం చేసారు. సోమవారం అధికారులతో, తహసిల్దార్లతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు 90వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఆర్.స్.కే స్థాయి లో రైతు ఎంత పంట వేసారు, ఎంత యూరియ అవసరం అవుతుంది, ఎంత యూరియా తీసుకున్నారు, ఎంతవరకు నిల్వ ఉంచారు అనే విషయాలను సమగ్రంగా విశ్లేసించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఎంత వినియోగించాలి , ఎలా వినియోగించాలి అనే విషయాల పై రైతులకు ఆర్.ఎస్.కే సిబ్బంది అవగాహన కలిగించాలని తెల్పారు. ఎరువుల పర్యవేక్షణ కు మండల స్థాయి లో తహసిల్దార్, ఎస్.హెచ్.ఓ , వ్యవసాయ అధికారులను బృందంగా నియమించడం జరిగిందని, వీరు నిత్యం మండలాల్లో పర్యటించి, అక్రమ నిల్వల పై నిఘా ఉంచాలని, ఇప్పటికే విజిలెన్సు వారు కేసు లు నమోదు చేస్తున్నారని, మండల ప్రత్యేకాధికారులు మండల బృందాలను సమీక్షించాలని తెలిపారు. అధిక నిల్వలు లేకుండా చూడాలని, ఎరువుల కొరత అనే మాట వినపడకూడదని , ఎరువుల పైగట్టి నిఘా ఉంచాలని సూచించారు.

## జిల్లాలో నకిలీ మందుల దందా..

(మొదటి పేజీ తరువాయి)

ఓ అధికారి ఉన్నారు అని చెప్పడం వరకే ..కానీ జిల్లాలో ఉండరు. ఇదేంటి అంటే మాకు ఇతర జిల్లాల ఇన్‌చార్జ్ బాధ్యతలు ఉన్నాయి. తాము అక్కడ కూడా చూసుకోవాలి కదా అంటూ సమధానాలు చెబుతారు. దీంతో మెడికల్ షాపుల మీద పూర్తిగా నియంత్రణ కరువైంది. మెడికల్ షాపు యూనియన్‌లు ఏది చెపితే అది వినడమే అధికారుల వంతు. ఒక్కో షాపుల్లో నకిలీ మందులు ఉన్నా అధికారులు పట్టించుకోరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే సంబంధిత అధికారులకు మెడికల్ షాపుల నుండి మామూళ్లు నెల నెలా అందుతున్నాయి. దీంతో వారు చెప్పినట్లు అధికారులు నడుచుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. నకిలీ మందులను నియంత్రించాల్సిన అధికారులే మామూళ్లకు అలవాటు పడడంతో ప్రజల ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయి.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

గంగరాజు, లక్ష్మికుమారి, ఎస్.సి.కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, డిఆర్ఓ ఖాజావలి,ఆర్.డి.ఓ. శ్రీనివాసరావు ప్రజల నుండి 256 పిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టరు ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటిషన్లను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. మరో 24 గంటల్లో గడువు ముగిసే పిటిషన్లు బియండ్ ఎస్ ఎల్ ఏ లోకి వెళ్ళకుండా ముందుగా పరిష్కరించాలన్నారు. సిఎంఓ నుండి అందిన అర్జీలకు సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజలలో సంతృప్తి స్థాయి శాతం తగ్గుతుందని, ప్రజలలో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలన్నారు. ఆగస్టు 15 వ తేది స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ లలో మెప్మా, డ్వామా, ఎపిఎంఐపి స్టాల్స్ కు 1,2, మరియు 3 స్థానంలలో ప్రైజ్ లు వచ్చాయని, మెప్మా పి.డి. విజయలక్ష్మి కు , డ్వామా పి.డి బి.శంకర్ కు , ఎపిఎంఐపి డి.డి ఎల్ వజ్రశ్రీకు జిల్లా కలెక్టర్ ఎస్ . నాగ లక్ష్మి మెమోంటోలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఇఓ జ్యోతిబాసు, డిపిఓ బి.వి.నాగసాయికుమార్, హౌసింగ్ పిడి ప్రసాద్, పి.డి.డి.ఆర్.డి.ఎ.విజయలక్ష్మి, డి.ఎస్.ఓ. చంద్రముని , జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు, డీడీ పశు సంవర్ధక శాఖ డా.కేవివి. సత్యనారాయణ, గ్రామ / వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ మోహన్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి.పవన్ కుమార్, డిఎఫ్ఓ హిమ శైలజ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మీ, డిఎంఅండ్ హెచ్ఓ., డా. విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన , రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ డి. శైలజ , ఎల్ డి ఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

పిజిఆర్ఎస్ లో 146 అర్జీలు అందాయని తెలిపారు. జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టరు సూచించారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## అది పింఛను మరణం కాదు : కలెక్టర్ అరుణ్‌బాబు

**నరసరావుపేట మేజర్ న్యూస్:** ముప్పాళ్ళ మండలం, చాగంటివారి పాలెం వాస్తవ్యులు మారూరి రామలింగా రెడ్డి ఆత్మహత్యకు కుటుంబంలో ఆర్థిక సమస్యల వల్ల ఏర్పడిన కలహాల వల్లే రామలింగా రెడ్డి బలవన్మరణానికి పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. పింఛను నిలిపి వేయలేదని అది కారణం కాదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. దృష్టిలోపం ధ్రువపత్రంతో



రామలింగా రెడ్డి నెలనెలా రూ.6,000 దివ్యాంగ పింఛను పొందుతున్నారని, అయితే వ్యక్తిగతంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం, ఆటో తోలుతూ జీవనం సాగిస్తుండటంతో పింఛను అర్హత నిరూపించుకోవాల్సిందిగా నోటీసు పంపడం జరిగిందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సూచన మేరకు మృతుడు ఎంపీడీవో వద్ద అప్పీలు కూడా చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారిలో కొందరికి మాత్రమే అర్హత నిరూపించుకోవాల్సిందిగా నోటీసులు జారీ చేయడం జరుగుతోందని, నోటీసులు పొందిన వారు అర్హత నిరూపించుకునేందుకు అవకాశం కూడా కల్పిస్తున్నామన్నారు. నోటీసులు ఇచ్చిన వారికి ఎవరికీ ఇప్పటిదాకా పింఛను తొలగించలేదన్నారు. అర్హత కలిగిన వారికి ఎవరికీ పింఛను తొలగించబోమని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

**– ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్ష సహకారంతో పల్నాడు జిల్లా విద్యావిభాగం ఆధ్వర్యంలో నరసరావుపేట నియోజకవర్గంలోని లింగంగుంట్లలో గల జిల్లా పరిషత్ హైస్కూల్, శంకరభారతి పురంలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం లో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ శిబిరం ఉదయం 10 గంటలకు ప్రారంభమై, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాలు, వినికిడి సాధనాలు, బ్రెయిలీ కిట్లు వంటి ఉపకరణాల నిర్ధారణ జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన ప్రసంగంలో "ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత. ఈ శిబిరం వారి విద్యా, సామాజిక అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుంది. సమగ్ర శిక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న ఈ చొరవలు విద్యార్థుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతాయి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. శిబిరంలో నిర్ధారణ చేయబడిన ఉపకరణాలను త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు పథకం

**గుంటూరు నగర ప్రతినిధి :** మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ పథకానికి మంచి స్పందన కనిపిస్తోంది. పథకం అమలు వేళ లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. దీనికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకుంటోంది. తాజాగా తిరుమలకు వెళ్లే బస్సుల్లోనూ పథకం అమలు చేయాలని నిర్ణయించారు. ఇదే సమయంలో పథకానికి సంబంధించి ఆర్టీసీ ఎండీ కీలక ప్రకటన చేసారు. ఉచిత బస్సు ప్రయాణం వైపు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు పైన ఆర్టీసీ డిపోల వారీగా సమాచారం సేకరిస్తోంది. ప్రభుత్వం సైతం ప్రయాణీకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. ప్రస్తుతం అయిదు కేటగిరీల బస్సుల్లో ఈ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతీ రోజూ 21 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని పొందుతున్నారని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. స్త్రీశక్తి పథకంలో ప్రస్తుతం 60 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు మందిని కారుణ్య నియామకాల కింద నియమించుకున్నామని ఎండీ వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం వైపు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు పైన ఆర్టీసీ డిపోల వారీగా సమాచారం సేకరిస్తోంది. ప్రభుత్వం సైతం ప్రయాణీకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. ప్రస్తుతం అయిదు కేటగిరీల బస్సుల్లో ఈ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతీ రోజూ 21 లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని పొందుతున్నారని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. స్త్రీశక్తి పథకంలో ప్రస్తుతం 60 శాతం మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీకి ఈ పథకం అమలు ద్వారా కొంత భారం అయినా.. ప్రభుత్వ లక్ష్యాలను అందుకునేలా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. త్వరలో 1050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని చెప్పారు. అదే విధంగా మరో 1500 బస్సులు సమకూర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 1500 మందిని కారుణ్య నియామకాల కింద నియమించుకున్నామని ఎండీ వివరించారు. పెన్షను సైతం పెంచామని తెలిపారు. ఇక.. తాజాగా ప్రభుత్వం ఘాట్ రోడ్ల సర్వీసుల్లోనూ ఉచిత బస్సు పథకం అమలుకు నిర్ణయించింది. దీని ద్వారా తిరుమల కొండకు వెళ్లే బస్సుల్లోనూ ఈ పథకం అమల్లోకి వచ్చింది. పథకం కోసం కేటాయించిన బస్సులకు ప్రత్యేక రంగులు.. జీరో టికెట్ల జారీ విషయంలో సిబ్బందికి స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న బస్ పాస్‌ల ద్వారా ఉచిత బస్సుల్లో ప్రయాణానికి అనుమతి ఇస్తున్నారు.

# మొక్కలు నాటుతున్న కన్నా

**– రైతన్నలకు మేలు చేకూర్చేది కూటమి ప్రభుత్వం మాత్రమే**
**– శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ**





**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** రైతన్నలకు మేలు చేకూర్చేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ముప్పాళ్ల మండలంలోని మాదల పిఏసిఎస్ చైర్మన్ చీమట పోలురాజు, మెంబెర్‌లుగా కొల్లా కోటేశ్వరరావు, బొప్పుడి లక్ష్మణ్ రావ్ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో శాసనసభ్యులు కన్నాతో పాటు జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో కో– ఆపరేటివ్ సొసైటీల పాత్ర ఎంతో కీలకమన్నారు. కొత్తగా నియమితులైన సొసైటీ ప్రతినిధులు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సొసైటీలో బకాయిలు త్వరగా చెల్లించేలా చూసి అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం 5000, కేంద్ర ప్రభుత్వం 2000 కలుపుకొని 7000 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వం 12,500 ఇస్తామని చెప్పి కేవలం 7500 మాత్రమే ఇచ్చింది... ప్రజలకు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని, తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో పిల్లలు ఎంతమంది ఉన్నా 15 వేల రూపాయలు చొప్పున వేసామన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నాము... ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ. 20 వేలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు తొలివిడతలో రూ. 7 వేలు జమ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుంటే జగన్ వాటిని చూసి ఓర్వలేక విషప్రచారాలు చేస్తున్నాడు... కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా కాంటీన్లు పునరుద్ధరణ యువతకు ఉద్యోగాలు హామీలను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమం లో భాగంగా మాదల హైస్కూల్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించి విద్యార్థులను నాణ్యత గురించి అడిగి భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమం లో వివిధ హొదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకాని శివయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ BVLN చక్రవర్తి దంపతులు



**పెదకాకాని మేజర్ న్యూస్ :**
పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ BVLN చక్రవర్తి దంపతులు సోమవారం ఉదయం దర్శించుకున్నారు. జస్టిస్ B-VLN చక్రవర్తి దంపతులను ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ మేళ తాళములతో సాదర స్వాగతము పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. న్యాయమూర్తి దంపతులు ముందుగా రాహు, కేతు పూజలు చేయించుకొని అనంతరం శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి అభిషేక సేవలో, శ్రీ భ్రమరాంబ అమ్మవారికి అష్టోత్తరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా జడ్జి B.సాయి కళ్యాణ చక్రవర్తి దంపతులు శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి అభిషేక సేవలో, శ్రీ భ్రమరాంబ అమ్మ వారికి అష్టోత్తరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరము ఇరువురు న్యాయమూర్తులకు వేద ఆశీర్వచన మండపం నందు ఆలయ స్థానాచార్యులు, అర్చక స్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేయగా శ్రీ స్వామి వారి శేషవస్త్రముతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, శ్రీ స్వామి వారి చిత్రపటం ఆలయ ఉప కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలా కుమార్ అందజేసినారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రోటోకాల్ న్యాయమూర్తి వారు, జ్యుడీషియల్ సిబ్బంది, పోలీస్ శాఖ వారు మరియు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగురాళ్ల రైల్వే పట్టాలపై రెండు మృతదేహాలు

**– మృతులు ఇరువురు గాంధీనగర్ కాలనీ వాసులు**
**– ఇది హత్యే అంటున్న మృతుని తండ్రి మరిదాసు**







**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :**
పిడుగురాళ్ల పట్టణం జానపాడు రోడ్డు రైల్వే గేటు సమీపంలో రెండు మృతదేహాలు పడి ఉన్నాయి. రైలు పట్టాలపై మృతి చెందిన ఇరువురు వ్యక్తులను రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతులు షేక్ షరీఫ్ (22) సంవత్సరాలు, గరికపూడి ఏసు దాసు (36) గా పోలీసులు గుర్తించారు . మృతి చెందిన ఏసు దాసు కు భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతులు ఇరువురు పిడుగురాళ్ల లోని గాంధీ నగర్ కు చెందిన వ్యక్తులుగా నడికుడి రైల్వే ఎస్సై పి. రమేష్ బాబు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనకు సంబంధించి విచారణ చేస్తున్నామని రైల్వే పోలీసులు విలేకరులకు తెలియజేశారు. మృతులలో ఏసుదాసు తండ్రి మరియదాసు మీడియాతో మాట్లాడుతూ, తమ కుమారుడు స్థానికంగా టాపీ పని చేసుకుంటూ, ఒక దినపత్రికలో పాత్రికేయుడుగా పనిచేస్తున్నాడని ఆయన తెలిపారు. ఈ క్రమంలో పిడుగురాళ్ల పట్టణంలోని ఒక కులానికి చెందిన వ్యక్తులు తమ కుమారుని, షేక్ బాజీ ని అత్యంత దారుణంగా చంపి రైల్వే ట్రాక్ పై పడవేశారని మరియదాసు ఆరోపించారు. ఈ హత్యలలో పాల్గొన్న వ్యక్తుల గురించి పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మీడియా ముఖంగా రైల్వే పోలీసులను, స్థానిక పోలీసులను మరియదాసు వేడుకున్నారు. ఇదిలా ఉండగా గాంధీనగర్ కు చెందిన ఇరువురు వ్యక్తులు ఒకేసారి మృత్యువాతకు గురి అవ్వడంతో పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం ఆరోగ్యవంతమైన పంటలు

**– పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక కార్యక్రమం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా పల్నాడు జిల్లాలో ఉద్యమంలా రైతుల్లోకి తీసుకెళ్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు అన్నారు స్థానిక బృందావనం మీటింగ్ హాల్లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ కార్యక్రమానికి స్టేట్ యాంకర్ మధు మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు 2025-26 లక్ష్యం 82,619 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యం ఇప్పటివరకు 65,000 ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పూర్తయింది రైతులు రసాయనాలు వదిలి కషాయాల వినియోగం పెంచడం ద్వారా భూసారం మెరుగుపడుతుంది ప్రకృతి పరిరక్షించబడుతుంది ఆరోగ్యకర ఉత్పత్తులు లభిస్తాయి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధ్యం అవుతుంది ప్రతి సిబ్బంది నిరంతరం ఆదాయాన్నిచ్చే ఏ టి యం మోడల్, ఏ. గ్రేడ్ మోడల్ సాగు చేయడం ఆదర్శనీయమన్నారు. ఐ సి ఆర్ పి (5 ఎకరాలు), యూనిట్ ఇంచార్జ్ (10 ఎకరాలు) కాంపాక్ట్ బ్లాక్స్ లో ప్రకృతి వ్యవసాయం చెయ్యడం అభినందనీయమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ పంటలో నమోదు చేయాలని సూచించారు ప్రతి సోమవారం మండల ప్రభుత్వ కార్యాలయాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి రైతుల ఉత్పత్తులను నేరుగా అమ్మడం ద్వారా రైతుకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహారం అందుతుంది మహిళల భాగస్వామ్యం ప్రతి ఇంటి ఆవరణలో పెరటి తోటలు, సూర్య మండలం మోడల్ కూరగాయలు సాగు చేయాలని మహిళా సంఘాల ద్వారా ప్రోత్సహిస్తున్నారు రసాయనాలు లేని ఉత్పత్తులు కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు ప్రభుత్వ సహాయం ప్రతి గ్రామ సమైక్య సంఘం పరిధిలో ఎన్ పి ఎం షాప్, ప్రకృతి వ్యవసాయ ఇన్పుట్ వనరుల కేంద్రం ఏర్పాటు అర్హులైన రైతులకు ? 50,000 నగదు మద్దతు – జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ ఎం ఎన్ ఎఫ్) పథకం ద్వారా అందజేస్తున్నది వివరాలకు రైతులు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. అమల కుమారిని సంప్రదించాలన్నారు హాజరైనవారు అడిషనల్ డీపీఎం ప్రేమ్ రాజు, వైఆర్ఎఫ్ స్వాతి, జిల్లా ఎన్ఎఫ్ఏలు నందకుమార్, సైదయ్య, సౌజన్య, అప్పలరాజు, మేరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీతానగరంలో కర్మకాండల సత్రం ప్రారంభం

### – మంత్రి నారా లోకేష్ సొంత నిధులు రూ. 8 లక్షలతో కర్మకాండల సత్ర నిర్మాణం





**మంగళగిరి,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సీతానగరంలోని పుష్కర ఘాట్ వద్ద నిర్మించిన కర్మకాండల సత్రాన్ని కూటమి నాయకులు సోమవారం ప్రారంభించారు. స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి నారా లోకేష్ సుమారు రూ. 8 లక్షలతో కర్మకాండల సత్రం నిర్మించారు. సత్రంలో తగిన సదుపాయాలను కూడా ఏర్పాటు చేశారు. అడిగిన వెంటనే సొంత నిధులతో సత్రం నిర్మించినందుకు స్థానిక ప్రజలు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ కర్మకాండల సత్రం నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు సొంత నిధులు వెచ్చించి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో అంత అరాచకం, దౌర్జన్యాలు జరిగాయని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, వేలకోట్ల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు, బిజెపి పట్టణ అధ్యక్షులు వల్లూరు శివరామకృష్ణ, తాడేపల్లి పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి ధారదాసు, మేకా పుల్లారెడ్డి, నాయకులు ఇట్టా పేంచలయ్య, అద్దంకి మురళి, దానిబోయిన సుందరరావు యాదవ్, దొంతి రెడ్డి సాంబిరెడ్డి, షేక్ నాగులు మీరా, ఇట్టా భాస్కర్, తాడిబోయిన భాస్కర్, షేక్ మస్తానయ్య, కోయ్యగూర మహాలక్ష్మి, అన్నెం కుసుమ, పి కృష్ణవేణి, ఉయ్యాల శ్రీనివాసరావు, షేక్ చాంద్ బాషా, షేక్ సైదా, వల్లభపురం పీటర్ పాల్, గోలి సౌరి, గాడి సాంబశివరావు, పోతాబత్తుల శ్రీనివాసరావు, జి నాగేశ్వరావు, పుల్లెపు భాస్కర్ రావు, చొంగల హరినాద్, బండి సాంబిరెడ్డి, కొర్రపాటి విజయ్, బోల్లెద్దుల మరియన్నా జి.ఆంకాల రావు, గాజుల కృష్ణ, చుంచు లక్ష్మి నారాయణ, కంచర్ల శివప్రసాద్, బెజ్జం బాబురావు, దుర్గారావు, తాడిబోయిన గోపి, కే సాయిచంద్, సైకం సాంబయ్య, పి హనుమంతు, సంక్రాంతి అశోక్,అంజలి, విశాల తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన బి.పి.మండల్

### – ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** అనాదిగా సామాజిక అన్యాయానికి గురైన వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీల జీవితాలలో వెలుగులు నింపిన, బడుగుల ఆరాధ్య దైవం బి.పి. మండల్ అని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కొనియాడారు. బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు బీసీ నేతలు పూలమాలలు వేసి,స్వీట్లు పంచి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ... మండల్ బీహార్ లోని మధేపురాకు చెందిన ఓ భూస్వామ్య యాదవ కుటుంబ బిహారిలాల్ మండల్–సీతాపతి మండల్ దంపతులకు జన్మించారు. వారు ధనస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ,తన జీవితకాలమంతా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసమే కృషి చేశారన్నారు. సోషలిస్టు భావజాలంతో పలు రాజకీయ పార్టీలలో పనిచేసి, పలుమార్లు ఎమ్మెల్యేగా,ఎంపీగా పేదలు–బడుగులకు సేవ చేశారన్నారు. 1968లో బీహార్ కు 7వ ముఖ్యమంత్రిగా, తన మంత్రివర్గంలో మొట్టమొదటిసారిగా అట్టడుగు వర్గాలకు చెందిన ఓబీసీలకు పెద్దపీట వేశారన్నారు. తన ఓబీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్న కారణంతో తన సీఎం పదవిని కూడా తృణప్రాయంగా త్యజించిన గొప్ప నాయకుడు వారన్నారు. వీరు మంచి పార్లమెంటేరియన్‌గా, 2వ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా పర్యటించి,ఓబీసీల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి, వారి సాధికారితకు ప్రతిపాదించిన 42 సిఫారసులతో ఆనాటి రాష్ట్రపతి జ్ఞాని జైల్‌సింగ్‌కు నివేదిక సమర్పించారన్నారు. మండల్ కమిషన్ నివేదికను ఒక దశాబ్దం పాటు ఇందిరాగాంధీ అటకెక్కించినప్పటికీ,ప్రధాని వీ.పీ. సింగ్ విద్య–ఉద్యోగాలలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ,మండల్ సిఫారసులను అమలు జరిపారన్నారు. దీనితో దేశవ్యాప్తంగా ఎందరో నిరుద్యోగ ఓబీసీ యువత మేలు పొందారన్నారు. బి.పి.మండల్ తన సిఫారసులలో జనాభాలో సగభాగంగా ఉన్న ఓబీసీలతో పాటు, ఓబీసీ మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు ఉండాలని ప్రతిపాదించారన్నారు. అందుకే బిపి మండల్ స్ఫూర్తితో వారి ఆశయాల సాధన కోసం చట్టసభలలో ఓబీసీలకు రిజర్వేషన్లివ్వాలని,33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్– కోటానిస్తూ చట్ట సవరణ చేసి అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లతో గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అలాగే మిగిలిన 40 మండల్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు జరపాలని,ఇలా ఓబీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఓబీసీ సంఘాల నాయకులతో పాటు మొత్తం ఓబీసీ సమాజం నడుం బిగించి పోరాడాలని శంకరరావు పిలుపునిచ్చారు. ఇంకా ఈ జయంతి వేడుకలలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, సీనియర్ బీసీ నాయకులు కేసన కోటేశ్వరరావు,వాకా వెంకటేశ్వరరావు,ఏ.శ్రీనివాస్, జంజనం వరప్రసాద్, దానా గౌడ్, యువజన నాయకులు సిరాజ్,శివ, గోపి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పొగాకు రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

### – నల్లమడరైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు



**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్:**
రైతు దగ్గర ఉన్న పొగాకు చివరి ఆకు కూడా కొంటామని రైతులు అధైర్యం చెంద వద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచెన్న నాయుడు లు హామీ ఇచ్చారని ఇప్పుడు ఆ హామీని తుంగలోకి తొక్కరని, ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం మాట నిలుపుకోవాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం సోమవారం ఉదయం పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమోహన్ రావు మాట్లాడుతూ గతంలో మార్కుఫెడ్ ద్వారా కొంటామని హామీ ఇచ్చి, ప్రయివేట్ కంపెనీ లకు అప్పగించి, రైతు లకు అన్యాయం చేస్తున్నారని ప్రభుత్వం తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైయివేట్ కంపెనీలు మాత్రం 12 వేల రూపాయలకు కొనకుండా 6 వేలు, 5 వేలు, 4 వేల రూపాయలకు కొంటూ రైతు లను మోసం చేయడమే కాకుండా పూర్తి స్థాయిలో పొగాకు కొనడం లేదని అన్నారు. ఇప్పటికి రైతుల వద్ద అధిక మొత్తం లో పొగాకు ఉన్నదని, అదేమంటే పొగాకు కు డిమాండ్ లేదని చెబుతున్నారని, పొగాకు డిమాండ్ లేకపోతే సిగరేట్ల ధరలు మాత్రం తగ్గడం లేదని, సిగరెట్ల కంపెనీ షేర్ల విలువ కూడా పెరుగుతుంది కానీ రైతులకు మాత్రం రేటు మాత్రం పెంచడం లేదని ప్రైవేట్ కంపెనీ ల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తదనంతరం తహసీల్దార్ హేనప్రియ కు వినతిపత్రం అందజేశారు. అయన వెంట రైతు సంఘ నాయకులు కాపు సాంబశివరావు, ఎన్ చినబాబు, గద్దె నాగేశ్వరరావు, కాకుమాను రమేష్, కె వి చౌదరి, కట్టా కోటేశ్వరరావు, కాపు అప్పారావు, పనుబోతుల ప్రసాద్ మరియు రైతులు పాల్గొన్నారు.

# సబ్ కలెక్టర్ గ్రీవెన్స్‌కు పది పిర్యాదులు



**తెనాలి, మేజర్ న్యూస్ :**
తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో పది పిర్యాదులు అందినట్లు సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు. పట్టణంలోని పినపాడు లో సాగునీటి కాల్వను పగలకొట్టడం వల్ల పొలాలకు నీరు అందక ఎండిపోతున్నదని రైతులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే చర్యలు తీసుకుని సాగునీరు అందించాలని కోరారు. తెనాలి ని జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు సబ్ కలెక్టర్ ను కోరారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి మూడు, మున్సిపల్ రెండు, పోలీస్, వైద్య ఇతర శాఖలకు సంబందించి మొత్తం పది పిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# మున్సిపల్ గ్రీవెన్స్‌కు మూడు పిర్యాదులు



**తెనాలి, మేజర్ న్యూస్ :**
మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో మూడు పిర్యాదులు అందాయని ఇంచార్జ్ కమీషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒకటి ఉన్నాయన్నారు. రోడ్డు వేయాలని గత 13 నెలలుగా తిరుగుతున్న కార్యాచరణకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ నాయకులు ఇంచార్జ్ కమీషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. టెండర్లు పిలిచినా పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులను ప్రశ్నిస్తే బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని చెబుతున్నారు. రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు సిద్ధంకండి



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**
మట్టి గణపతే మహా గణపతి అని ప్రతిఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితి వేడుకలకు కంకణబద్దులు కావాలని, ప్రధానంగా యువత కాలుష్యరహిత పండుగల నిర్వహణలో ముందు భాగాన ఉండాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ పర్యావరణహిత పండుగ చేసుకోవాలని రూపొందించిన వాల్ పోస్టర్ ని కమిషనర్ తమ చాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి పెను ముప్పు వాటిళ్లుతోందన్నారు. మన భక్తి వల్ల మరొకరికి ముప్పు వాటిల్లడం మంచిది కాదని ప్రతి ఒక్కరూ ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. కనుక వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణంను అందించగలమని పేర్కొన్నారు. కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ షుమారు 2500ల మట్టి వినాయక ప్రతిమలను వినాయకచవితి సందర్భంగా ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కూడా పర్యావరణానికి ప్రమాదం వాటిల్లని విధంగా పండుగలు జరుపుకోవడంలో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఇర్రి సాయి పాల్గొన్నారు.

## సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** ప్రముఖ సీనియర్ న్యాయవాది ఈ ఎల్లారెడ్డి, రామిరెడ్డిల జన్మదినోత్సవ వేడుకలో సత్తెనపల్లి వైయస్సార్సీపి నియోజకవర్గ ఇన్చార్జ్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం కార్తికేయ రెసిడెన్సిలో జరిగిన ఎల్లారెడ్డి రామిరెడ్డి లకు జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభధ్యక్షులుగా అచ్యుత శివప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి చాలా మంచి వ్యక్తిని సౌమ్యుడని, అలాంటి వ్యక్తిని మనం దరం గెలిపించుకునే అవకాశం వచ్చిందని దాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి గురించి మాట్లాడుతూ న్యాయవాదిగా ఎలా ఉండాలో ఆయన చూసి నేర్చుకోవాలి అన్నారు. నిబద్ధత కలిగి, న్యాయవాద వృత్తికి వన్నె తెచ్చారన్నారు. న్యాయవాది చిన్న మణి బాబు మాట్లాడుతూ న్యాయవాదుల జన్మదినోత్సవ కార్యక్రమానికి ఏ నియోజకవర్గ సమన్వయకర్త ఇప్పటివరకు హాజరవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు, భవనం వెంకట్రామిరెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, న్యాయవాదులు రాజారపు శివ నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, జూపల్లి శేషయ్య, వీరయ్య, ఎం ఏడుకొండలు, సాంబి రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, నాగూర్ బాబు, నవ జ్యోతి బాబు తదితరులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసుదేవ్ మృతిపై అనుమానం

**– ఆస్తి కాజేసిన చేసిన నాగభూషణంపై చర్యలు తీసుకోవాలి**
**– ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు**



**గుంటూరు క్రైమ్ మేజర్ న్యూస్ :**
తన బావ వాసుదేవ్ మృతి పై ఉన్న పలు అనుమానాలు నివృత్తి చేయాలని, ఆస్తి కాజేసిన నాగభూషణంపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కంచర్ల జోసెఫ్ ఫిర్యాదు చేశారు. మా అక్క వాసుదేవ్ సతీమణి 2017లో నల్లపాడులోని తన అపార్ట్మెంట్లో మృతి చెందిందని తెలిపారు. వారికి పిల్లలు లేరని, మా అక్క చనిపోవడంతో బావగారు ఉద్యోగం చేసిన శ్రీకాకుళం జిల్లా పలాస కు వెళ్లి మిత్రులందరికీ పలకరించి వస్తానని వెళ్లి రాలేదని తెలిపారు. అనంతరం 2022లో నివాసంలో వేరే కుటుంబం వచ్చి ఆక్రమించుకొని ఉంటున్నారని తెలిపారు. మృతుని తమ్ముని పిల్లలమని తెలిపారని, మృతిని ఆస్తులు ఆక్రమించుకొన డానికి పథకం పందినట్లు తెలిపారు. నల్లపాడులో ఉన్న మృతిని అపార్ట్మెంట్ తాళాలు పగలగొట్టి డాక్యుమెంట్లు, నగదు, బంగారం దొంగిలించారని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. నకిలీ డాక్యుమెంట్తో ఆస్తి కాజేయాలని చూసిన నాగభూషణాన్ని అరెస్టు చేసి, మృతుడు వాసుదేవ్ ఎలా చనిపోయాడో న్యాయ విచారణ చేపట్టాలని కోరారు.

## లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

**– ఇద్దరు బాలురు దుర్మరణం**

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** రోడ్డు పక్కనే ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు బాలురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కొలను కొండకు చెందిన సాత్విక్ అలియాస్ చెర్రీ (14), వడ్డే శ్రీనౌన్ అలియాస్ ఖుషీ (15) లు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై విజయవాడ నుంచి కొలనుకొండలోని తమ ఇళ్లకు తిరిగి వస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యలోని జయభేరి అపార్ట్మెంట్స్ ఎదుట రహదారి పక్కనే నిలిపిన లారీని ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు బాలురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గమనించిన స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు ప్రమాదం ఘటనపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తాడేపల్లి పోలీసులు హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఇద్దరు బాలురు కొలనుకొండకు చెందిన వారని, ఒకరు విజయవాడ లోని ఓ కార్పొరేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతుండగా మరో బాలుడు స్థానిక కార్పోరేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువురి బాలురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# డీఎస్సీతో నిరుద్యోగుల కల సాకారం

**– సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు**
**– డీఎస్సీ ఆపాలన్న జగన్ కుట్రలను తిప్పికొట్టాం**
**– యువతకు మేలు చేయాలనే సంకల్పం నెరవేరింది**
**– గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు నగర ప్రతినిధి :** కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాట ప్రకారం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించడం నిరుద్యోగులకు కలలు సాకారం చేయడమేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ విజయవంతం అమలు చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు సోమవారం పత్రిక ప్రకటనలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇక ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి లోకేశ్ చెప్పడం దేశ చరిత్రలోనే ఏపీని విద్యా రంగంలో సముచిత స్థానంలో నిలబెడుతుందని పేర్కొన్నారు. యువత బాగుపడటం ఇష్టంలేని జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు వేశారని మండిపడ్డారు. 2014–19 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే.. టీడీపీ ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 13 డీఎస్సీల ద్వారా 1,80,208 పోస్టులిచ్చి చరిత్ర సృష్టించినట్లు పేర్కొన్నారు. ఎన్ని కుట్రలు చేసినా యువతకు మంచి చేయాలనే లక్ష్యంతో డీఎస్సీని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులతోపాటు ప్రతి తరగతికి ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టీచర్ పోస్టులు 23 వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డీఎస్సీ పేరిట జగన్ యువతకు మోసం చేశారని మండిపడ్డారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెటించిన దుర్మార్గానికి ఒడిగట్టింది జగన్ కాదా అని ప్రశ్నించారు. సిఫార్సు బదిలీల పేరుతో రూ. 50 కోట్లు అక్రమంగా లాగేసుకున్నది నిజం కాదా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో విద్యారంగానికి ఉజ్వల భవిష్యత్తు వచ్చిందని పేర్కొన్నారు.

## రెండు తెలుగు రాష్ట్రాలలో కృష్ణుడి రూపంలో ఉన్న విగ్రహాల తొలగింపుకు న్యాయపోరాటం

**– శ్రీకృష్ణుని రూపంలోని ఎన్టీఆర్ విగ్రహం తొలగించే విషయంలో సహకరించిన మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు**
**–బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్**




**మంగళగిరి, మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించడానికి సహకరించిన మంత్రి నారా లోకేష్, నిర్వాహకులు, గ్రామస్తులకు, ఈ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్పందించిన హిందూ సంఘాలు, బిసి సంఘాల ప్రతినిధులకు బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన మంగళగిరిలోని బిసివై పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తక్కెళ్లపాడులో శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న హిందూ సంఘాలు, యాదవ సంఘాలు పెద్ద ఎత్తున వ్యతిరేకించాయన్నారు. తాను కూడా తక్కెళ్లపాడుకు వెళ్లి విగ్రహం ఏర్పాటు చేయ వద్దని నిర్వాహకులకు చెప్పి వస్తే... విగ్రహం పెట్టబోమని ప్రకటించి మళ్లీ రాత్రికి రాత్రే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. దీంతో తాను విశాఖపట్నం నుంచి ఛలో తక్కెళ్లపాడుకు పిలుపునిచ్చానన్నారు. దీంతో వివాదాన్ని గుర్తించిన మంత్రి నారా లోకేష్ జోక్యంతో నిర్వాహకులు బేషజాలకు పోకుండా శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని తొలగించి, ఎన్టీఆర్ రూపంలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. వారందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

వివాదాస్పద ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును వ్యతిరేకించిన తనపై కొందరు బెదిరింపులకు దిగుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కేసులు పెడతామని, కుట్ర చేస్తామని బెదిరిస్తున్నారని, అలాంటి ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. గతంలో తన ఇంటిపై దాడిచేసిన అల్లరిమూకల పరిస్థితి ఏమైందో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. మంగళగిరి పార్టీ ఆఫీసుకు వస్తామని కొందరు తనను టార్గెట్ చేసి మాడ్లాడుతున్నారని వాటన్నిటికీ బెదిరే ప్రసక్తే లేదన్నారు. కొందరు పని గట్టుకొని శ్రీకృష్ణుడిని అవమానించే విధంగా మాట్లాడుతున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకృష్ణుడు ఎలా ఉంటాడో తెలుసా అని... రామారావు వల్లే శ్రీ కృష్ణుడికి ప్రాచుర్యం వచ్చిందనే అర్థం వచ్చేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. అలా మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుళ్ల రూపంలో నటుల విగ్రహాల ఏర్పాటు చేసే సంస్కృతి నశించాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. ఇప్పుడు శ్రీకృష్ణుడు రూపంలో ఎన్టీఆర్ విగ్రహాలు పెట్టాలని ప్రయత్నించినట్టుగానే, శివుడి రూపంలో చిరంజీవిని, అమ్మవారి రూపంలో రమ్యకృష్ణ విగ్రహాలను ప్రతిష్టించినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ విష సంస్కృతి నశించాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గతంలో శ్రీకృష్ణుడు రూపంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు రామచంద్రయాదవ్ విజ్ఞప్తి చేశారు. అలాగే ఆ విగ్రహాల తొలగింపుకు త్వరలోనే కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామన్నారు. రామారావు విగ్రహాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, మనోభావాలను కించ పరిచేలా ఏర్పాటు చేస్తే చూస్తూ ఊరుకునే పరిస్థితి మాత్రం లేదన్నారు. ఇక కరేడు రైతులకు మద్దతుగా తాను వెళ్తే అడుడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని రామచంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరేడు ఉద్యమానికి బిసివై పార్టీ అండగా ఉంటుందని, రైతుల నుంచి ఒక్క సెంటు భూమి తీసుకున్నా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని రామచంద్రయాదవ్ హెచ్చరించారు.

## క్షవర వృత్తి విలువలను మంట కలుపుతున్న కార్పొరేట్ స్పా సెంటర్స్

**– నాయీబ్రాహ్మణ జేఏసీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు**



**గుంటూరు, విద్య మేజర్ న్యూస్ :** కార్పొరేట్ సంస్థలు సెలూన్లు స్పా సెంటర్స్ ప్రారంభించి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు వ్యభిచారం నిర్వహిస్తూ అక్రమంగా తుపాకులు విక్రయిస్తూ క్షుర వృత్తికి ఉన్న విలువలను మంట కలుపుతున్నారని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు మంగమూరు రోడ్డు వద్ద కార్పొరేట్ శక్తులు ఇతరులు స్పా సెంటరునిర్వహిస్తూ ఆగస్టు 23 రాత్రి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముగ్గురు యువతులను ఇద్దరు యువకులను ఒంగోలు పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసారని నరసింహారావు అన్నారు. విజయవాడ నగరంలో ఇదేవిధంగా స్పా సెంటర్లు ప్రారంభించి చట్ట వ్యతిరేకంగా వ్యభిచారం నిర్వహించిన సంఘటనల్లో నాయీబ్రాహ్మణ వృత్తి దారుల మనో భావాలను దెబ్బతీసిన పరిస్థితి ఉందని, సెలూన్స్ ముసుగులో ఇతర రాష్ట్రాల నుంచి వృత్తికి సంబంధం లేని వ్యక్తులు హైదరాబాదు ప్రాంతాలకు వచ్చి తుపాకుల దందా యు పి యువకులు నిర్వహించటం దుర్మార్గమని ఇతర రాష్ట్రాలలో అక్రమంగా తుపాకులు తయారు చేసే వారితో సంబంధాలు పెట్టుకుని లైసెన్సు లేకుండా తుపాకులను సెలూన్ లో భద్రపరిచి అక్రమంగా అమ్ముతూ హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసులకు పట్టుపడ్డారు 5 కంట్రీమేడ్ 18 రౌండ్లు బుల్లెట్లు, మొబైల్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన నాయీ బ్రాహ్మణ ల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసినట్లుయిందని అన్నారు. నాయీబ్రాహ్మణులు వృత్తి ని నమ్ముకుని జీవిస్తున్న వారి పొట్టలు కోరుతున్న కార్పొరేట్ శక్తులకు ఇతరులకు చెక్ పెట్టాల్సిఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి అనాదిగా క్షవరవృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణ వృత్తి దారులకు వృత్తిపై పేటెంట్ హక్కు కల్పించాల్సిన అవసరము ఆవశ్యకత ఎంతో ఉందని తాటికొండ నరసింహారావు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

## కాశిమాల వారి వివాహ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గజ్జల

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మండలం గర్నెపూడి గ్రామంలో ఎంపీటీసీ కాశిమల ఓబయ్య ఏసమ్మ కుమారుడు ప్రశాంత్ బాబు వివాహ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించరు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండలం గ్రామ వార్డు పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బంధన్ బ్యాంకు వార్షికోత్సవం



**ప్రత్తిపాడు, మేజర్ న్యూస్ :**
పెదనందిపాడు మండల పరిధిలోని నాగులపాడు బంధన్ బ్యాంకు లో బ్యాంకు పదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐ మధు పవన్ పాల్గొని వార్షికోత్సవ కేక్ ను కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకు యాజమాన్యం, సిబ్బంది కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తూ, విశేష కృషి చేస్తూ పదవ సంవత్సరంలోకి అడుగు పెట్టడం శుభపరిణామమని సిబ్బంది సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఏరియా మేనేజర్ యు వి రామారావు, బ్యాంకు మేనేజర్ శావనం శ్రీనివాస రెడ్డి, సిబ్బంది, బ్యాంకు కస్టమర్స్ తదితరులు పాల్గొన్నారు.

# సమతుల్య పోషకాహారంపై కెఎల్‌యు విద్యార్థులకు అవగాహన



**మంగళగిరి, మేజర్ న్యూస్ :**
తాడేపల్లి మండలంలోని పెనుమాక గ్రామంలో "స్మార్ట్ విలేజ్ రివల్యూషన్" కార్యక్రమం కింద, కె.ఎల్. యూనివర్సిటీ లోని ఇసిఇ, ట్రీపుల్ ఈ, సిఎస్ఈ విభాగాల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాల ఆహారపు అలవాట్లు, పోషకాహారం పై అవగాహన, గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆహారపు జాగ్రత్తలు, పిల్లల పెరుగుదలలో పోషకాహార ప్రాధాన్యత వంటి అంశాలపై సర్వే నిర్వహించారు. అదేవిధంగా, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఉపాధ్యాయులతో, చిన్నపిల్లలతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు పిల్లలకు ఇచ్చే ఆహారం, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందించే అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ పైలట్ స్టడీ కేవలం విద్యార్థులకి సామాజిక అనుభవాన్ని కలిగించడమే కాకుండా, సేకరించిన సమాచారం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్యశాఖ కొత్త విధానాలు రూపొందించేందుకు మార్గనిర్దేశం చేస్తుంది. గ్రామీణ కుటుంబాల జీవనశైలిని మెరుగుపరచడానికి, సమతుల్య ఆహారం, ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ఇది ఎంతో దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో ఎస్వీఆర్ కోఆర్డినేటర్లు పి. సత్యనారాయణ, టీ. శివకృష్ణ విద్యార్థులతో కలిసి చురుకైన పాత్ర పోషించారు.

# పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని వినతి

**– గుర్రం జాషువా జిల్లా సాధన రాష్ట్ర కమిటి**



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**
పల్నాడు జిల్లాకు 'గుర్రం జాషువా పల్నాడు జిల్లా'గా పేరు పెట్టాలని రాష్ట్రప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ పల్నాడు జిల్లా సాధన రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పల్నాడు జిల్లా గుర్రం జాషువా జిల్లా సాధన రాష్ట్ర కన్వీనర్ ఎనుముల నాగేశ్వరావు అడపా మోహన్ మాదిగ తదితరులు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పేర్ల మార్పు, చేర్పుల నేపథ్యంలో, వినుకొండ మండలం చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించిన నవయుగ కవిచక్రవర్తి, పద్మశ్రీ అవార్డు గ్రహీత గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టడం సముచితమని వారు అభిప్రాయపడ్డారు. పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టడం ద్వారా ఆయనకు గౌరవం దక్కుతుందని, ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని వారు కలెక్టర్‌ను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా జిల్లా సాధన సమితి నాయకులు , బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు, ఎమ్మార్పీఎస్ఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతరాల మీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కోట.

# యూరియాపై రైతులకు ఆందోళన వద్దు

**తెనాలి, మేజర్ న్యూస్ :** రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఏ డి ఏ కె రాజకుమారి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో ఎరువుల షాపులను ఆమె తనిఖీ చేశారు. కొలకలూరు గ్రోమోర్ దుకాణంలో ఎరువులు తనిఖీ చేసి రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచి ప్రతి ఒక్కరికి కావలసినంత ఎరువులు అందించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడి యూరియా కొరతంటూ ఏమి లేదు రైతులందరికీ అందుబాటులో యూరియా ఉందని ప్రతిఒక్కరికి అందిస్తామని ఆమె తెలిపారు.



# బాల్య వివాహాలు ముందస్తు గర్భధారణ వాటి దుష్ప్రభావాలపై న్యాయ అవగాహన సదస్సు



**గురజాల, మేజర్ న్యూస్ :** గురజాల మండలం న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆధ్వర్యంలో గురజాల ఎస్టీ కాలనీలో బాల్య వివాహాలు ముందస్తు గర్భధారణ వాటి దుష్ప్రభావాలపై న్యాయ అవగాహన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వై శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం గురించి వివరించారు భార సోసియేషన్ జనరల్ సెక్రటరీ కే చలమరాజు ఎస్సీ ఎస్టీ ఆక్ట్ గురించి వివరించారు. పానెల్ లాయర్స్ ప్రభుదాసు జానీ భాష మనోవర్తి ఉచిత న్యాయ సహాయం తదితర చట్టాలు గురించి వివరించారు. మెడికల్ ఆఫీసర్ సాయి కిరణ్ కుమార్ చిన్న వయసులో గర్భధారణ వల్ల ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. సిడిపిఓ అపరంజి బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు వారికి సమాచారం అందించినట్లయితే వివాహాన్ని నిలుపుదల చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో న్యాయవాది సాల్మన్ రాజు మరియు ఎస్సై వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# భవన కార్మికుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తా

**– కార్మికులకు ప్రభుత్వ పరంగా తోడుగా నిలుస్తాం**
**– కార్మికులంతా సంక్షేమ బోర్డులో రిజిస్టర్ అవ్వాలి**
**– మృతి చెందిన భవన నిర్మాణ కార్మికునికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు నగర ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ హామీ ఇచ్చారు. పాత గుంటూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేజండ్ల కోదండ రామయ్య మృతి చెందడంతో ఎమ్మెల్యే నసీర్ సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. దీనిపై కార్మిక శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. సహజ మరణమైతే రూ. 60 వేలు సాయం చేస్తారని వెల్లడించారు. కార్మికుల కుమార్తెల వివాహానికి రూ. 20 వేలు, ప్రసవ సమయంలో రూ. 30 వేలు, ప్రమాదవశాత్తు గాయపడి, పనిచేయలేని స్థితిలో ఉన్న కార్మికులకు గరిష్టంగా నెలకు రూ. 4,500 వరకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అసంఘటిత కార్మికులకు సైతం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నారని, వీరికి తాను ప్రభుత్వ పరంగా సౌకర్యాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల పిల్లల చదువులు, ఉద్యోగాల విషయంలో తనను సంప్రదించాలని సూచించారు.

# గణేష్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

**– సాంప్రదాయబద్ధంగా తీన్మార్ కోలాటాలతో పండుగ చేసుకోవాలి**
**– జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్**

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** గణేష్ నిమజ్జనంలో డీజేలకు అనుమతిలేదని, సాంప్రదాయ బద్ధంగా తీన్మార్ కోలాటాలతో పండుగ చేసుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ అన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం శివాలయంలో సోమవారం వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రవి కుమార్ మాట్లాడుతూ... మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాయక నిమజ్జనోత్సవంలో ఎలాంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడరాదన్నారు. ఒకరినొకరు పరస్పరం గౌరవించుకుంటూ శాంతియుతంగా సాంప్రదాయ బద్ధంగా పండుగ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు పగలు, రాత్రి విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు పహారా ఉండాలన్నారు. విద్యుత్తు, అగ్నిమాపక శాఖల అనుమతులు తీసుకోవడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీ కృష్ణ, రూరల్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పాల్గొన్నారు.



# సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ప్రముఖ సీనియర్ న్యాయవాది ఈ ఎల్లారెడ్డి, రామిరెడ్డిల జన్మదినోత్సవ వేడుకలో సత్తనపల్లి వైయస్సార్సీపి నియోజకవర్గ ఇన్చార్జ్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం కార్తికేయ రెసిడెన్సిలో జరిగిన ఎల్లారెడ్డి రామిరెడ్డిలకు జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభధ్యక్షులుగా అచ్యుత శివప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి చాలా మంచి వ్యక్తిని సౌమ్యుడని, అలాంటి వ్యక్తిని మనందరం గెలిపించుకునే అవకాశం వచ్చిందని దాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి గురించి మాట్లాడుతూ న్యాయవాదిగా ఎలా ఉండాలో ఆయన చూసి నేర్చుకోవాలి అన్నారు. నిబద్ధత కలిగి, న్యాయవాద వృత్తికి వన్నెతెచ్చారన్నారు. న్యాయవాది చిన్న మణి బాబు మాట్లాడుతూ న్యాయవాదుల జన్మదినోత్సవ కార్యక్రమానికి ఏ నియోజకవర్గ సమన్వయకర్త ఇప్పటివరకు హాజరవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు, భవనం వెంకట్రామిరెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, న్యాయ వాదులు రాజారపు శివ నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, జూపల్లి శేషయ్య, వీరయ్య, ఎం ఏడుకొండలు, సాంబి రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, నాగూర్ బాబు, నవ జ్యోతి బాబు తదితరులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కలివెల జ్యోతి ఎన్నిక



**మాచర్ల మేజర్ న్యూస్ :** మాచర్ల మున్సిపల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎన్నిక పల్నాడుజిల్లా జాయింట్ కలెక్టర్, గురజాల ఆర్డీవో, మాచర్ల ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ సమక్షంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా కలివెల జ్యోతిని వైస్ చైర్మన్ అభ్యర్థిగాఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీవో మురళీకృష్ణ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించి, నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పదవి నాకు రావడానికి కృషిచేసిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్, తోటి కౌన్సిల్ సభ్యులు, టిడిపి నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## డీజేలకు అనుమతులు లేవు : దుర్గి ఎస్సై

**దుర్గి మేజర్ న్యూస్ :** వినాయక చవితి వేడుకలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన శిక్షలు తీసుకుంటామని దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ హెచ్చరించారు. వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాలలో ఏర్పాటు చేయు వినాయకుడి మండపాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్లైన్ వెబ్ సైట్ ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు అనంతరం పోలీస్ డిపార్ట్మెంట్ అందించే క్యూఆర్ కోడ్ ను మండపాల దగ్గర గాని, లేదా ఊరేగింపులో ఉపయోగించే ట్రాక్టర్ లకు గాని అంటించాల్సిందిగా సూచించారు. అదేవిధంగా వినాయకుడి మండపాల నిర్వహణను పరిశీలించే కమిటీల వివరాలను పోలీస్ స్టేషన్ నందు అందించాలని, అవాంఛనీయ సంఘటనలు జరిగినచో కమిటీ సభ్యులపై చట్టరీత్య చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. వినాయకుడి మండపాల ముందు గాని, ఊరేగింపులో గాని డీజే లను వినియోగించకూడదని తెలియజేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని ఘనంగా నిర్వహించుకుని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.




# తడి - పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలి

**– డ్రైనేజీల్లో చెత్త చెదారం పడవేయవద్దు**
**– నగర కమిషనర్ అలీం బాషా**





**మంగళగిరి,మేజర్ న్యూస్ :** తడి–పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు వేరుగా చేసి చెత్త ఆటోలలో వేయాలని నగర కమిషనర్ అలీం బాషా అన్నారు. సోమవారం ఆయన నగర పాలక సంస్థ అధికారులతో కలిసి నగరంలోని క్లాప్ ఆటోల ద్వారా వచ్చే చెత్త డోర్ టు డోర్ సేకరణను పరిశీలించారు. పలు వార్డులలో తడి–పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం పడవేయడం వల్ల కాలువల్లో ఇరుక్కుపోవడంతో ఓవర్ ఫ్లో అయ్యే ప్రమాదం ఉందని, ప్రజలు అవగాహనతో వ్యవహరించాలన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని అన్నారు. కాలువల్లో బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణకై ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారులు ప్రతినిత్యం పర్యవేక్షణ చేయాలని అన్నారు. అనంతరం కమిషనర్ అలీం బాషా కొలనుకొండ డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ కు వచ్చి చెత్తను ప్రణాళిక బద్ధంగా జిందాల్ ప్లాంట్ కు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డ్ చుట్టూ మొక్కలు నాటాలని ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తాడేపల్లి గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను పరిశీలించి అక్కడ ఏ విధంగా చర్యలు చేపట్టాలనే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి రామారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాము, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సేనతో సేనాని పోస్టర్ల ఆవిష్కరణ

**– జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు మేజర్ న్యూస్ :**

ఈ నెల 28 నుంచి 30 వరకు విశాఖపట్నంలో జనసైనికులతో జరగనున్న విస్తృత సమావేశాలను జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఒక పవిత్ర యజ్ఞంలా నిర్వహించనున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సోమవారం శ్రీనివాసరావుతోటలో సేనతో సేనాని పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి అయన ఆవిష్కరించారు. దేశం బాగుండాలని ప్రజలు ఆనందంగా ఉండాలని పరితపించే వ్యక్తి పవన్ కళ్యాణ్ అంటూ కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో జన సేనది కీలకపాత్ర అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ దాష్టికాలను జనసైనికులు ఎదురొడ్డి ధైర్యంగా పోరాడారన్నారు. ప్రజల కోసం జనసైనికులు ఎన్నో ఇబ్బందులు ఎదురుకున్నారని , మరెన్నో త్యాగాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో జనసేనది కీలకపాత్ర అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అన్ని విభాగాల శ్రేణులతో మూడు రోజుల పాటు వివిధ స్థాయిల్లో సమావేశాలు జగనున్నాయని తెలిపారు. పార్టీ బలోపేతం , భవిష్యత్ కార్యాచరణకు సంభంధించి అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారని ఆళ్ళ హరి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శిలు బండారు రవీంద్ర , మెహబూబ్ బాషా , కొత్తకోట ప్రసాద్ , మారుతీ కిషోర్ , వడ్డే సుబ్బారావు , బద్రి, స్టూడియో బాలాజీ, నందూరి స్వామి, ఇల్లా శేషు, జక్కారాఘవులు, కుమారస్వామి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ కమిషనర్‌కి అందిన ప్రతి ఆర్జీని పరిష్కరించాలి

**– నగర కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు అందించే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, ప్రతి సోమవారం ఆర్జీల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 18 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా 33 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 16, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 2, పరిపాలన విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంఓహెచ్(ఇంచార్జి) రామారావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి, మేజర్ న్యూస్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు సోమవారం పలువురు లబ్ధిదారులకు అందజేశారు. నగరంలోని గండాలయపేటకు చెందిన గుంటి వీరాస్వామికి రూ. 52,543, మార్కండేయకాలనీకి చెందిన మోరు సత్యవతికి రూ. 23,920, ఇస్లాంపేటకు చెందిన ఖాజా మొయినుద్దీన్ కుమారుడు షేక్ గౌసియాకు రూ. 20,541, టిడ్కో గృహసముదాయానికి చెందిన వెంగళ మల్లేశ్వరికి రూ. రూ. 37,836, వెజిటేబుల్ మార్కెట్ కు చెందిన తిరువీధుల పద్మావతికి రూ. 40,112, టిప్పర్లబజార్ కు చెందిన మొహమ్మద్ ఆసిఫ్ అహ్మద్ కు రూ. 42,500, కొత్తపేట కు చెందిన బూదాటి మల్లీశ్వరి కి రూ. 87,226, గాడిపర్తి క్రాంతి కి రూ. 28,437, టిప్పర్ల బజార్ కు చెందిన షేక్ షరీఫున్ కు రూ. 27,341, కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన మంద్రు నిర్మల కు రూ. 20 వేల విలువైన చెక్కులను అందజేశారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి,పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, షేక్ ఖదీర్ బాషా (బుజ్జి ), రంగిశెట్టి నరేంద్ర (బాబీ), గోవాడ దుర్గారావు, తాడిగిరి సుధీర్, షేక్ ఫిరోజ్, ఊట్ల దుర్గా మల్లేశ్వరి, వంగర హనుమాన్,వంగర సదాశివారావు, షేక్ అమీర్, సాయినాథామ్ శ్రీనివాసరావు, పందేటి మణికంఠ, కట్టదుర్గారావు, తెలు వెంకటేశ్వరరావు,అన్వర్ బాషా, షేక్ కరీముల్లా, ఇండ్ల రజని, నక్క రాజశేఖర్, పందిరి వెంకన్న,పొదిలి హరిబాబు,గుడిపూడి శివకృష్ణ,ఫణిదం మల్లేశ్వరరావు, రంగిశెట్టి పెద్దబ్బాయ్, కొరమట్ల రాజా, షేక్ సలీమ్,కొల్లి శ్రీనివాసరావు, ఉప్పు మహేష్,కాకి మల్లిఖార్జున రావు, గంజి శివ సుధా, సాల లీలావతి, పందిరి శ్రీకన్య, షేక్ నీలోఫర్, పాతకోటి భాస్కర్, షేక్ బాబు, కగ్గా వెంకటరావు, కగ్గా కృష్ణ, బేతాళ కాంతారావు, చింతక్రింది వెంకటేశ్వరరావు, పాగోలు జయ ప్రకాష్, నందూరి పురుషోత్తం, హఫీజ్ ఖాన్ పఠాన్,రాజేంద్ర,సుభాని, తదితరులు పాల్గొన్నారు.

